## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 10-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- దేశ రక్షణ రంగం ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి సారించామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ఉగ్రవాదపై చైనా ద్వంద్వ వైఖరిని భారత్ ఉపేక్షించబోదని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు.
- భారత రక్షణ రంగానికి సంబంధించి గత 11 సంవత్సరాలలో చారిత్రాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.
- "వసుధైవ కుటుంబకం" అనేది భారతదేశ జీవన విధానమని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.
- భారత వ్యోమగామి శుభాంషు శుక్లా రోదసి యాత్రలో భాగంగా రేపు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లనున్నారు.

=======================

దేశ రక్షణ రంగ ఉత్పత్తిలో ఆధునీకరణ, స్వావలంబనపై ప్రత్యేక దృష్టి సారించామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. గత 11 సంవత్సరాలుగా భారతదేశ రక్షణ రంగంలో అద్భుతమైన మార్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. రక్షణ రంగాన్ని బలోపేతం చేయాలనే దృఢ సంకల్పంతో భారత ప్రజలు ఐక్యంగా నిలిచారని సామాజిక మాధ్యమం ఎక్స్ లో ప్రధానమంత్రి పేర్కొన్నారు. మరోవైపు జాతీయ సాంకేతిక వస్త్ర మిషన్, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (PLI) పథకం వంటి కీలక కార్యక్రమాల ద్వారా దేశంలో సాంకేతిక వస్త్ర రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని నరేంద్రమోదీ అన్నారు. కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ సామాజిక మాధ్యమంలో పేర్కొన్న ఒక సందేశానికి ప్రధాని స్పందిస్తూ.... జౌళి రంగంలో ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని, ఆవిష్కరణల, ఎగుమతులను పెంచుతున్నామని తెలిపారు.

=======================

ఉగ్రవాదంపై చైనా ద్వంద్వ వైఖరిని భారత్ ఉపేక్షించబోదని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ఐరోపా పర్యటనలో ఉన్న ఆయన ఈరోజు ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... ఉగ్రవాదం అందరికీ సంబంధించిన

సమస్య అని అన్నారు. భారతదేశం ఓవైపు ఉగ్రవాదంపై పోరాటం చేస్తుంటే, పాకిస్తాన్ మాత్రం వారికి ఆశ్రయం కల్పిస్తూ... మద్దతు నిస్తోందన్నారు. తమ పోరాటం ఉగ్రవాదానికి వ్యతిరేకంగానే తప్ప ఏ ప్రత్యేక దేశంతో కాదని ఆయన స్పష్టం చేశారు. భారతదేశంపై దాడి చేస్తే, ఉగ్రవాదులు పాకిస్తాన్‌తో సహా ఎక్కడ ఉన్నా వారిని విడిచి పెట్టబోమని జైశంకర్ హెచ్చరిస్తూ...

(వాయిస్ 39 సెకన్లు)

======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 11 సంవత్సరాలలో భారతదేశ రక్షణ రంగంలో చారిత్రాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సరిహద్దు, భద్రతా బలోపేతం, ఆధునిక సాయుధ దళాలు, స్వదేశీ ఆయుధాలు, రక్షణ ఎగుమతులలో నరేంద్ర మోదీ నాయకత్వం ప్రపంచ విశ్వాసం చూరగొందని, అంతేగాక రక్షణ రంగాన్ని స్వావలంబన వైపు నడిపించిందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

======================

“వసుధైవ కుటుంబకం...” అనేది నినాదం కాదని అది భారతదేశ జీవన విధానమని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. హైదరాబాద్‌లో ఈరోజు జరిగిన అంతర్జాతీయ యువ శాస్త్రవేత్తల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... వెనుకబడిన వర్గాలకు సాధికారత కల్పించే దిశగా మార్గాలను అన్వేషించాలని, సమగ్ర పర్యావరణ వ్యవస్థకు ఆవిష్కరణలు చేపట్టాలని ఈ సందర్భముగా శాస్త్రవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ నిర్మాణానికి విజ్ఞాన శాస్త్రాన్ని అనుసంధానించాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

======================

రోదసి యాత్ర చేపట్టనున్న భారత వ్యోమగామి శుభాంషు శుక్లాకు ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ శుభాకాంక్షలు తెలిపారు. అంతరిక్ష యాత్ర సురక్షితంగా, విజయవంతంగా పూర్తి కావాలని కోరుకుంటున్నాని పేర్కొన్నారు. భారత అంతరిక్ష చరిత్రలో శుభాంశు శుక్లా నూతన అధ్యాయం లిఖించాలని ఆకాంక్షించారు. భారత కాలమానం ప్రకారం రేపు సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుండి స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ -9 రాకెట్‌లో శుభాంషు శుక్లాతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లనున్నారు. కాగా భారత వింగ్ కమాండర్ రాకేష్ శర్మ 1984లో అంతరిక్షంలోకి వెళ్లిన దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత, యాక్సియం-4 మిషన్‌లో భాగంగా శుభాంషు శుక్లా రేపు రోదసి యాత్ర చేపట్టారు.

విరామం

======================

దేశానికి వెన్నెముక అయిన రైతుల ఆదాయాలను పెంపొందించడంతో పాటు, శాస్త్రీయ ఆధారిత వ్యవసాయ పద్ధతులను అవలంబిచడానికి కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ “వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్ర”కు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని మే 29 కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఒడిశాలోని పూరిలో ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద ఈ నెల 12వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా 16 వేల మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు 700 పైగా జిల్లాల్లో 1.5 కోట్ల మందికి పైగా రైతులను కలుసుకుని పంటల సాగుకు సంబంధించి సలహాలు, సూచనలు అందిస్తారు. ఈ 15 రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ భువనేశ్వర్, పానిపట్, మీరట్, భోపాల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలలో పర్యటించి రైతులతో నేరుగా సంభాషించారు.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ఆశాకిరణంగా ఆవిర్భవించిందని కేంద్ర, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈరోజు చెన్నైలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ.... భారతదేశం నిరాశాజనక స్థితి నుండి ఉజ్వల భవిష్యత్ వైపు రూపాంతరం చెందిందన్నారు. సేవ, సుపరిపాలన, పేద ప్రజల సంక్షేమంపై దృష్టి సారించి, అమృత కాలం వైపు భారత్ తన ప్రయాణాన్ని ప్రారంభించిందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల ప్రయోజనం కోసం కేంద్ర ప్రభుత్వం సమగ్ర దృక్పథంతో అనేక పథకాలను అమలు చేసిందని గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ...

(వాయిస్ 42 సెకన్లు)

========================

జాతీయ భద్రతా సలహా బోర్డు (ఎన్ఎస్ఏబీ) సభ్యుడిగా (డీఆర్డీవో) మాజీ ఛైర్మన్ సతీశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈరోజు నుంచి 2 సంవత్సరాల పాటు ఆయన ఎన్ఎస్ఏబీ సభ్యుడిగా కొనసాగనున్నారు. 'రా' చీఫ్ అలక్ జోషి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఈ జాతీయ భద్రతా సలహా బోర్డును ఏర్పాటు చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో ఉన్న జాతీయ భద్రతా మండలికి ఈ బోర్డు సూచనలు చేయనుంది.

========================

ఆస్ట్రియా దేశంలోని గ్రాజ్ నగరంలో ఒక పాఠశాలలో ఈరోజు జరిగిన కాల్పుల్లో 10 మంది మరణించగా, అనేక మంది గాయపడ్డారు. ఓ విద్యార్థి తరగతి గదుల్లోకి చొరబడి విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో ఈ ఘటన చోటుచేసుకుందని ఆస్ట్రియా అధికార వర్గాలు వెల్లడించాయి. అతడిని నివారించడానికి ప్రయత్నించిన మహిళా ఉపాధ్యాయురాలిపై పలుమార్లు కాల్పులు జరపడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారన్నారు. అనంతరం తనను తాను కాల్చుకొని మరణించాడని అధికారులు తెలిపారు.

========================

ప్రపంచ శాంతి, పురోగతికి ఉగ్రవాదం పెను ముప్పుగా పరిణమిస్తుందని కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ అన్నారు. 23వ జాతీయ భద్రతా దళం (NSG) అంతర్జాతీయ సదస్సును ఆయన ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... భారతదేశం ఎలాంటి ఉగ్రవాద కార్యకలాపాలను సహించబోదని, వాటిని ఎదుర్కొనేందుకు నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటూనే ఉంటుందని స్పష్టం చేశారు.

========================

ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ మ్యాచ్ ఇంగ్లాండ్‌లోని లార్డ్స్ వేదికగా రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ గద కోసం దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లు పోటీపడనున్నాయి.

========================
========================